రైల్వే పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న కిషోర్‌బాబు

అడ్డగుట్ట: రైల్వే పెన్షనర్లకు ఏ సమస్య వచ్చినా సహాయం చేయడానికి దక్షిణ మధ్య రైల్వే సిద్ధమని ప్రిన్సిపల్ సీపీఓ కిషోర్‌బాబు అన్నారు. పెన్షనర్స్ డేను పురస్కరించుకొని సోమవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం ఆడిటోరియంలో ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వేమెన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన పీసీపీఓ కిషోర్ బాబు మాట్లాడుతూ.. రైల్వే పెన్షనర్ల సమస్యలను పరిష్కరించేందుకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వే ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు శేషసాయి మాట్లాడారు. పెన్షనర్ల విషయంలో మార్పులు, దేశంలోని పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సంఘాలన్నీ ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ తెలంగాణ కార్యదర్శి కృష్ణ మోహన్, ఏఐఆర్ఆర్ఎఫ్ జాతీయ అధ్యక్షులు సాగరం శ్రీధర్, శివకుమార్, కృష్ణకుమారి పాల్గొన్నారు.

నైట్ షెల్టర్‌లో వైద్యశిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

సనత్‌నగర్: వియ్ ఫర్ ఉమెన్ సంస్థ తృతీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బేగంపేటలోని నైట్ షెల్టర్‌లో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. అనంతరం వారికి దుప్పట్లు అందజేసి అన్నదానం చేశారు. వియ్ ఫర్ ఉమెన్ వ్యవస్థాపకురాలు గాంధీ మెడికల్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రతిభాలక్ష్మి మాట్లాడుతూ.. తమ సంస్థ ప్రారంభించిన నాటి నుంచి ఎన్నో వినూత్నమైన కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నామన్నారు. ముఖ్యంగా మహిళా సాధికారత దిశగా తమ సంస్థ అడుగులు వేస్తోందని, ఇందులో అందరూ భాగస్వాములు కావాలన్నారు. డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ మదన్‌మోహన్, అశ్విని, అభిరామ్ పాల్గొన్నారు.

టైపిస్టు, స్టెనో ఉద్యోగాలను పునరుద్ధరించాలి



భట్టికి ఉద్యోగాల పునరుద్ధరణపై విన్నవిస్తున్న సభ్యులు

లాలాపేట: తెలంగాణ టైపు రైటింగ్, షార్ట్ హాండ్, కంప్యూటర్ ఇనిస్టిట్యూట్స్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్కను మర్యాద పూర్వకంగా కలిశారు. గత ప్రభుత్వం రద్దు చేసిన టైపిస్టు, స్టెనో ఉద్యోగాలను పునరుద్ధరించాలంటూ వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ మసూద్ అలీ తదితరులున్నారు.

ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే చర్యలు తప్పవు



ఆక్రమణలు తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

లాలాపేట: పాదచారుల కోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే చర్యలు తప్పవని నల్లకుంట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు హెచ్చరించారు. ఆపరేషన్ రోప్ కార్యక్రమంలో భాగంగా సోమవారం హబ్సిగూడ మెట్రో స్టేషన్ నుంచి తార్నాక చౌరస్తా వరకు ఫుట్‌పాత్‌పై ఉన్న ఆక్రమణలను తొలగించి 18 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై జయానంద్, ఏఎస్సై వెంకటేశ్వర్‌రావు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకల్లో ఎమ్మెల్యే



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని

కంటోన్మెంట్: సుబ్రహ్మణ్య షష్ఠిని పురస్కరించుకుని మారేడుపల్లిలోని సుబ్రహ్మణ్య స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆలయాన్ని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సంతోష్ యాదవ్, ఈఓ అరుణ కుమారి, కమిటీ సభ్యులు రమేశ్, వేణుగోపాలాచారి, నాగేందర్ యాదవ్, భాస్కర్, పద్మజ, రాజేశ్వర శర్మ పాల్గొన్నారు.

ఆస్పత్రి అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్

లాలాపేట: హాస్పిటల్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి అన్నారు. సోమవారం అర్బన్ హెల్త్ పోస్టు తుకారాంగేటు (యూపీహెచ్‌సీ) లాలాపేట పట్టణ ఆరోగ్య కేంద్రంలో హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ సమావేశం జరిగింది. ఎస్పీహెచ్ఓ డాక్టర్ జయశ్రీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ పాల్గొని పలు అంశాలపై చర్చించారు. టాయ్‌లెట్, డ్రెసింగ్ రూమ్, తాగునీరు, తదితర కనీస సౌకర్యాలు లేవని అక్కడి వైద్యులు డిప్యూటీ మేయర్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆమె వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలన్నీ పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సౌశీల్యారాణి, స్థానిక ప్రతినిధులు పాల్గొన్నారు.

మూణ్ణాళ్ల ముచ్చటగా రూ.3 కోట్ల రోడ్డు!

అనాలోచిత నిర్ణయాలతో ప్రజాధనం వృథా

పీజీ రోడ్ వీడీసీసీ రోడ్డుపై నిత్యం తవ్వకాలు

రాంగోపాల్‌పేట్: నగరంలో మొట్టమొదటి సారిగా అధునికమైన పద్ధతిలో నిర్మించిన వీడీసీసీ రోడ్డు.. సుమారు రూ. 3 కోట్ల వ్యయంతో సుమారు 25 ఏళ్ల పాటు మన్నిక ఉండేలా నిర్మించారు. నిర్మాణం పూర్తయిన తర్వాత అద్దంలా మెరిసిన రోడ్డును చూసి స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. కానీ.. కొన్ని రోజులకు వివిధ చోట్ల తవ్వాల్సిన దుస్థితి నెలకొంది. అధికారుల నిర్లక్ష్యం, హడావిడి నిర్ణయాలతో నిర్మించి ఆరేళ్లు కూడా గడవక ముందే పది చోట్ల తవ్వారు. ఇప్పుడు దీని మన్నిక ఎన్నాళ్లుంటుందో ఏమో తెలియని పరిస్థితి. ప్రజాధనం ఇష్టం వచ్చినట్లు ఖర్చు చేసిన అధికారుల నిర్లక్ష్యానికి ఇది నిదర్శం.



నీరు కలుషితమవుతోందని డిమ్మీ పాన్‌షాప్ వద్ద రోడ్డును తవ్వుతున్న దృశ్యం

సమన్వయ లోపమే..

2016–17 మధ్య కాలంలో పీజీ రోడ్డులో వీడీసీసీ పద్ధతిలో నిర్మించాలని అప్పటి మంత్రి, ఇప్పటి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులకు సూచించారు. ఈ పద్ధతిలో మొట్టమొదటి సారిగా ఇక్కడే దీన్ని ప్రారంభించారు. ఈ పద్ధతిలో రోడ్డు నిర్మిస్తే 20 నుంచి 25 ఏళ్ల పాటు మన్నిక ఉంటుందని మళ్లీ మళ్లీ నిర్మించాల్సిన అవసరం ఉండదని భావించారు. కానీ ఏ రోడ్డు నిర్మించినా జలమండలి, విద్యుత్ తదితర శాఖల అధికారులు కలిసి భూగర్భంలో ఉండే పైప్‌లైన్ పరిస్థితి ఏమిటి.. ఎప్పుడు నిర్మించారు, మరో 25 ఏళ్లపాటు ఉంటాయా లేదా అనేది అధికారులు ఆలోచించాల్సి ఉంది. కానీ ప్రజాప్రతినిధుల మాటే శిరోధార్యం అన్నట్లు హడావిడిగా అధికారులు అవన్నీ ఆలోచించకుండా నిర్ణయాలు తీసుకుని అనుకున్నదే తడవుగా పనులు చేపట్టి పూర్తి చేశారు. ఇలా నిర్మించిన రోడ్డును చూసి ఆయా కాలనీల వాసులు సంబరపడ్డారు. కానీ కొద్ది రోజులకే అధికారుల బండారం బయటపడింది. మంచినీరు లీకేజీ, కలుషిత జలాలు సరఫరా కావడం, మురుగు నీరు పొంగడం తదితర సమస్యలు ఈ రోడ్డుపై తలెత్తాయి.

10 చోట్ల తవ్వకాలు..

నిర్మించిన ఏడాదికే వెస్లీ కాలేజ్ ప్రాంతంలో రోడ్డును తవ్వి సమస్య పరిష్కరించారు. కానీ అది అంతటితో ఆగలేదు, ఈ రోడ్డులో పలు ప్రాంతాల్లో ఇదే సమస్య ఉత్పన్నమవుతూ వస్తుంది. ఇలా ఇప్పటి వరకు సుమారు 10 చోట్ల తవ్వకాలు చేపట్టి సమస్యలు పరిష్కరిస్తున్నారు. ఇప్పుడు డిమ్మీ పాన్ షాప్ వద్ద కలుషిత జలాల సమస్యతో మళ్లీ తవ్వకాలు చేపట్టారు. ఎప్పుడైతే ఈ రోడ్డును తవ్వుతారో దాని మన్నిక అనేది లేకుండా పోతుంది. తవ్విన ప్రాంతంలో మళ్లీ ప్యాచ్ వర్క్ చేసినా రోడ్డు కొద్దికొద్దిగా శిథిలావస్థకు చేరుతుంది. ఇలా అనేక చోట్ల కొత్త రోడ్డును తవ్వి ప్యాచ్ వర్కులు చేయడంతో మరికొద్ది రోజుల్లో మొత్తం రోడ్డు నిర్మించాల్సిన అవసరం రావచ్చు. సమన్వయ లోపం, నిర్లక్ష్యంగా ప్రజాధనాన్ని వృథాగా ఖర్చు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

పార్లమెంట్ ఎన్నికలకు కసరత్తు

అసెంబ్లీ సెగ్మెంట్లకు ఏఆర్‌ఓల నియామకం

సికింద్రాబాద్: ఇటీవల శాసనసభ ఎన్నికల తంతును పూర్తిచేసిన అధికారులు త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల కోసం కసరత్తు చేస్తున్నారు. తాజాగా మళ్లీ ఓటర్ల జాబితా సవరణలు, పేర్ల నమోదు మొదలు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, సిబ్బంది నియామకం తదితర వాటి కోసం చర్యలు తీసుకునే ప్రక్రియ ప్రారంభమైంది. ఇందుకోసం ఎన్నికల కమిషన్ అధికారులు ప్రత్యేక అధికారులను నియమించారు. సికింద్రాబాద్, సనత్‌నగర్, అంబర్‌పేట్, ముషీరాబాద్ నియోజకవర్గాల్లో ఎన్నికల ఏర్పాట్ల కోసం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను (ఏఆర్‌ఓ) నియమించారు. ఏఆర్‌ఓలుగా జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ డిప్యూటీ కమిషనర్ ఎస్.సుధాంశ్, సికింద్రాబాద్ తహసీల్దార్ పాండు నాయక్, మారేడుపల్లి తహసీల్దార్ పద్మసుందరి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.ఎల్లారెడ్డిని నియమిస్తున్నట్లు ఎన్నికల కమిషన్ అధికారులు గెజిట్ జారీ చేశారు. అధికారుల నియామకంతో పాటుగా అదనపు ఓటర్ల జాబితా రూపకల్పన కోసం ఉత్తర్వులు జారీ చేశారు. వచ్చే వారం నుంచి ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు అమలులోకి తెచ్చేందుకు సహాయక రిటర్నింగ్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. త్వరలో నియోజకవర్గాల వారీగా ఓటర్ల విభాగం, ఎన్నికల అధికారులతో సహాయక రిటర్నింగ్ అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్‌గా వ్యవహరించనున్నట్లు ఎన్నికల కమిషన్ గెజిట్‌లో పేర్కొన్నారు.

సమస్యలు, అభివృద్ధి పనులపై సమీక్ష



సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న కార్పొరేటర్ ఏఓ సంధ్య

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు, సమస్యలకు సంబంధించి నామాలగుండులోని వార్డు కార్యాలయంలో సోమవారం సమీక్ష సమావేశం జరిగింది. వార్డు పరిపాలనా అధికారి సంధ్య, కార్పొరేటర్ సామల హేమ నేతృత్వంలో జరిగిన సమావేశానికి వివిధ విభాగాల అధికారులు హాజరయ్యారు. డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న రహదారుల నిర్మాణం, నాలా అభివృద్ధి, తాగునీటి లైన్ల నిర్మాణాలకు సంబంధించి సమీక్షించారు. సదరు అభివృద్ధి పనులు సత్వరమే ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. మహిళా పొదుపు సంఘాల పనితీరు గురించి చర్చించారు. అదే విధంగా వార్డు కార్యాలయానికి అందుతున్న ఫిర్యాదులు, పరిష్కారానికి సంబంధించిన అంశాలను సమీక్షించారు. ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ అసిస్టెంట్ ఇంజినీర్ కౌశిక్, అర్బన్ కమ్యూనిటీ ఆఫీసర్ ధనశ్రీ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస ఉత్సవాలు



శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వర ఆలయంలో వేడుకలు నిర్వహిస్తున్న పండితులు

చిలకలగూడ: చిలకలగూడలోని పలు ఆలయాల్లో ధనుర్మాస వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. శ్రీనివాసనగర్ శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో జనవరి 14వ తేదీ వరకు ప్రతిరోజు ధనుర్మాస పూజ, ప్రాతరారాధన, దీపారాధన, పాశురాలు, తిరుప్పావై పఠనం, నవకళశ అభిషేకం, ఉత్తరద్వార దర్శనం, సర్వదర్శనం, కుడారవల్లి ఉత్సవం, గోదా కల్యాణం తదితర ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష ఉపాధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్, వేణుగోపాలరావు ఈఓ రాజేష్‌కుమార్ తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం మరింగంటి విజయ్‌కుమార్ నేతృత్వంలో తిరుప్పావై ప్రవచనం ఉంటుందన్నారు. ఈనెల 23 వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని నామాలగుండు కల్యాణ వేంకటేశ్వర స్వామి, చిలకలగూడ సాయిబాబా సమేత బాలాంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, ఉత్తర ద్వార దర్శనం ఉంటుందని ఆలయ చైర్మన్లు నోముల ప్రకాశరావు, నాగులూరి సాయిబాబా తెలిపారు.

తల్లి కూతుళ్ల అదృశ్యం



అదృశ్యమైన తల్లి కూతుళ్లు

లాలాపేట: తల్లి, ఇద్దరు కూతుళ్లతో కలిసి అదృశ్యమైన ఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మాణికేశ్వర్‌నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ గోపి–సోనీ దంపతులు. గతంలో ఇద్దరి మధ్య గొడవలు కావడంతో సోనీ తన ఇద్దరు కూతుళ్లు దివ్య గిరీష్(13), కేజియా (14) కలిసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. గత అక్టోబర్‌లో పోలీసులు సముదాయించి ఇద్దరిని వేర్వేరుగా ఉండాలని సూచించారు. 15 రోజుల తర్వాత గోపి తన భార్య, పిల్లలను తన ఇంటికి తీసుకొచ్చాడు. ఇటీవల మళ్లీ గొడవ పడటంతో సోనీ తన కూతుళ్లను తీసుకుని చెప్పకుండా వెళ్లిపోయింది. బంధువులు, తెలిసిన వారితో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో గోపి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

విద్యార్థిని ఆత్మహత్య

అడ్డగుట్ట: తల్లి మందలించిందని మనస్తాపానికి గురైన ఓ విద్యార్థిని ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు వివరాల ప్రకారం.. లోహియా నగర్ ప్రాంతానికి చెందిన సరిత(17) సికింద్రాబాద్‌లోని ఓ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరం చదువుతుంది. సోమవారం ఉదయం సరితను తన తల్లి గట్టిగా మందలించడంతో తీవ్ర మనస్తాపానికి గురైంది. ఇంట్లో ఎవరూలేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది.

జాగ్రఫీ ప్రొఫెసర్ పదోన్నతి నిలిపివేత

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ సైన్స్ కాలేజీ జాగ్రఫీ విభాగం ప్రొఫెసర్‌కు కల్పించిన సీనియర్ ప్రొఫెసర్ పదోన్నతిని నిలిపివేసినట్లు అధికారులు సోమవారం తెలిపారు. తప్పుడు పత్రాలతో పదోన్నతి పొందినట్లు విచారణలో తేలినందున పాలక మండలి (ఈసీ) సమావేశంలో చర్చించి తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు చెప్పారు. సీనియర్ ప్రొఫెసర్ హోదాలో ఇంత కాలం చెల్లించిన వేతనాన్ని రికవరీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

సీఈఓతో ఎమ్మెల్యే లాస్య భేటీ



కంటోన్మెంట్: కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని ప్రాంతాల్లో అభివృద్ధికి సహకారం అందజేయాలని ఎమ్మెల్యే లాస్య నందిత, బోర్డు సీఈఓ మధుకర్ నాయక్‌ను కోరారు. ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక తొలి సారిగా బోర్డుకు వచ్చిన ఆమె సీఈఓతో ప్రత్యేకంగా భేటీ అయ్యి వివిధ అంశాలపై చర్చించారు. ముఖ్యంగా బోర్డు పరిధిలో రాష్ట్ర ప్రభుత్వ నిధులతో చేపట్టే పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సరఫరా మెరుగు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి నిధుల కేటాయింపు తదితర అంశాలపై చర్చించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నేతలు నివేదిత, టీఎన్ శ్రీనివాస్, పనస సంతోష్, వంగల మల్లేష్, రవికుమార్, కర్ణ కుమార్, దేవులపల్లి శ్రీనివాస్ ఉన్నారు.

డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యం



రోడ్డు పనులను ప్రారంభించిన కొలను లక్ష్మీబాల్‌రెడ్డి

సనత్‌నగర్: సనత్‌నగర్ డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి అన్నారు. అశోక్‌కాలనీ జాఫ్రీ మసీదు రోడ్డు నిర్మాణ పనులను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. గడిచిన తొమ్మిదిన్నర ఏళ్లలో మునుపెన్నడూ జరగని అభివృద్ధి జరిగిందన్నారు. సమస్య తన దృష్టికి తీసుకురావడమే తడవుగా అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చొరవ చూపించే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఎమ్మెల్యేగా ఉండడం మనందరి అదృష్టమన్నారు. డివిజన్ పరిధిలో ఎన్నో బృహత్తర ప్రాజెక్టులను ఆయన పూర్తి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ సందీప్, భాస్కర్, సూపర్‌వైజర్ అన్వర్, బీఆర్ఎస్ నాయకులు కొలను బాల్‌రెడ్డి, రాజు, చంద్రారెడ్డి, ఇబ్రహీం, నోమాన్, జమీర్‌బేగ్, అబ్రార్ పాల్గొన్నారు.

బస్తీల్లో నీటిఎద్దడి నివారణకు చర్యలు



బోర్‌వెల్ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ చీర సుచిత్ర

రాంగోపాల్‌పేట్: బస్తీల్లో నీటి ఎద్దడి లేకుండా చూసేందుకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నిధులతో బోర్‌వెల్స్ వేయిస్తున్నామని రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ అన్నారు. డివిజన్‌లోని మెక్లోడ్‌గూడలోని మైదానం వద్ద కిషన్‌రెడ్డి నిధులతో చేపట్టనున్న బోర్‌వెల్ పనులను ఆమె ప్రారంభించి మాట్లాడారు. గతంలో గాస్మండిలో కూడా బోర్‌వెల్ వేయించామని బస్తీల్లోని ప్రజలకు నీటి సమస్య తలెత్తినపుడు వాడుకునేందుకు ఈ బోర్‌వెల్స్ ఉపయోగపడతాయని చెప్పారు. ఇక్కడే సింటెక్స్ ట్యాంకు ఏర్పాటు చేసి నీరు అందుబాటులో ఉంచుతామన్నారు. అలాగే పీజీ రోడ్డులో జరుగుతున్న మంచినీటి పైప్‌లైన్ మరమ్మతు పనులను ఆమె పరిశీలించి వేగంగా పూర్తి చేయాలన్నారు.

- రాణిగంజ్‌లోని ఆదయ్య మెమోరియల్ హైస్కూల్‌లో జరిగిన వికలాంగుల దినోత్సవంలో కార్పొరేటర్ పాల్గొని వారికి క్రీడా పరికరాలను అందించారు. కోమల్, అశ్విని, నిర్మల, ధన్‌రాజ్, సంతోష్, చీర శ్రీనివాస్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలి

సనత్‌నగర్: బాల్యం నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. టీటీఐ, హీరో మోటార్స్ సంయుక్తాధ్వర్యంలో 'గీతాంజలి దేవాశ్రయ్' సికింద్రాబాద్ పాఠశాల విద్యార్థులకు రోడ్డుభద్రతా నియమాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. రోడ్డుపై వెళ్లేటప్పుడు క్రమశిక్షణగా వ్యవహరించాలన్నారు. సిగ్నలింగ్‌ను పాటిస్తూ ప్రమాదాల నివారణలో భాగస్వాములు కావాలన్నారు. జీబ్రా క్రాసింగ్ వద్దనే రోడ్డు దాటాలన్నారు. చిన్నారులు నిబంధనలు పాటిస్తూనే కుటుంబ సభ్యులకు కూడా అవగాహన కల్పించాలన్నారు.

తక్షశిల పాఠశాలలో అడ్వెంచర్ క్యాంప్

లాలాపేట: తక్షశిల హైస్కూల్‌లో సోమవారం స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో అడ్వెంచర్ క్యాంప్ జరిగింది. స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాఠశాలలో స్వయంగా రోప్ వాక్, క్యాంప్ ఫైర్ వంటి శిబిరాలను ఏర్పాటు చేశారు. దీనికి తెలంగాణ రాష్ట్ర స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆర్గనైజింగ్ కమిషనర్ అశోక్ రాజు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్కౌట్స్ అండ్ గైడ్స్ అంటే ఎంతో గౌరవంతో పాటు సమాజంలో నిరాడంబరతకు పేరు గాంచిందన్నారు. సేవా కార్యక్రమాల్లో వీరి సేవలు ఎంతో అభినందనీయం అన్నారు.

ట్రాఫిక్ పోలీస్ పేరిట వసూళ్లు

వ్యక్తి అరెస్టు

అమీర్‌పేట: ట్రాఫిక్ జరిమానాలు బకాయి ఉన్నాయంటూ వసూళ్లకు పాల్పడుతున్న నకిలీ ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను ఎస్ఆర్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. సబ్ ఇన్‌స్పెక్టర్ రవిరాజ్ వివరాల ప్రకారం.. ఓల్డ్ కాప్రాలోని శాలివాహన ఎన్‌క్లేవ్‌కు చెందిన శామ్యూల్ విక్టర్ కుమార్ (43) బ్రౌన్‌జాకెట్, ఖాకీ రంగు ప్యాంటు ధరించి గ్రీన్‌ల్యాండ్ కూడలిలో ట్రాఫిక్ జరిమానాల పేరిట డబ్బులు వసూళ్లు చేస్తున్నాడు. పెండింగ్ చలాన్లు చెల్లించాలని చెప్పి తన వద్ద ఉన్న క్యూ ఆర్ కోడ్‌కు జరిమానా మొత్తం చెల్లించుకుంటూ వసూళ్లకు పాల్పడుతున్నాడు. అనుమానం వచ్చిన వాహనదారులు అక్కడి చౌరస్తాలో ఉన్న ట్రాఫిక్ పోలీసులకు సమాచారం అందించగా అతడు నకిలీ కానిస్టేబుల్‌గా గుర్తించి అరెస్టు చేశారు.

తెలంగాణ వర్సిటీల కన్వీనర్‌గా జీవన్

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ యూనివర్సిటీ రాష్ట్ర కన్వీనర్‌గా ఓయూ పరిశోధన విద్యార్థి, ఏబీవీపీ నాయకుడు జీవన్ నియమితులయ్యారు. సోమవారం ఓయూలో ఆయన మాట్లాడుతూ.. నిరంతరం విద్యార్థుల సమస్యల పై పోరాడిన తనను గుర్తించిన జాతీయ నాయకులు ఇటీవల ఢిల్లీలో జరిగిన ఏబీవీపీ 69వ జాతీయ మహాసభలలో కన్వీనర్‌గా నియమించినట్లు పేర్కొన్నారు.

నిర్లక్ష్యం



ఓయూ క్యాంపస్‌లోని ఇండోర్ స్టేడియం పట్ల అధికారులు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. శీతాకాలంలో షటిల్, ఇతర ఆటల కోసం నిర్మించిన ఇండోర్ స్టేడియం గత కొన్ని ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోవడం లేదు. అధికారుల నిర్లక్ష్యం, ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యాపకుల అలసత్వంతో ఇండోర్ స్టేడియం మసకబారుతోంది. దీంతో కొన్ని ఏళ్లుగా స్టేడియం నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుతోంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. –ఉస్మానియా యూనివర్సిటీ

నిరుపయోగం



ఓయూ క్యాంపస్‌లో నూతనంగా నిర్మించిన అంఫీ థియేటర్, అధిక రుసుం కారణంగా ఠాగూర్ ఆడిటోరియం నిరుపయోగంగా మారుతున్నాయి.ఓయూ పూర్వ విద్యార్థి డాక్టర్.గుర్రం నాగయ్య రూ.86 లక్షల వ్యయంతో తన పేరు మీద అంఫీ థియేటర్‌ను నిర్మించి యూనివర్సిటీకి కానుకగా ఇచ్చారు. సుమారు రెండు వేల మంది కూర్చునే సామర్థ్యం గల అంఫీ థియేటర్‌ను కార్యక్రమాల నిర్వహణకు రూ.లక్ష రుసుం నిర్ణయించడంతో అద్దెకు తీసుకునేందుకు ఎవరు ముందుకు రావడం లేదు. ఇదిలా ఉండగా గతంలో విద్యార్థులకు రూ.10 వేలు, ఇతరులకు రూ.40 వేలు అద్దె ఉన్న ఠాగూర్ ఆడిటోరియం రుసుంను అందరికీ ఒకే ధర రూ.2 లక్షలకు పెంచారు. అంఫీ థియేటర్‌ను ఉచితం, ఠాగూర్ ఆడిటోరియాన్ని గల రూ.10 వేలకు ఇవ్వాలని విద్యార్థి నాయకులు కోరారు. – ఉస్మానియా యూనివర్సిటీ

వ్యర్థాలకు నిలయం



హబ్సిగూడ పీ అండ్ టీ కాలనీలోని రూ. కోట్ల విలువ చేసే ఓయూ భూమి డంపింగ్ యార్డుగా మారింది. ఇంత కాలం కబ్జాలో ఉన్న సుమారు 2000 గజాల భూమి యూనివర్సిటీ స్థలంగా కోర్టు గతేడాది తీర్పునిచ్చింది. నాటి నుంచి ఓయూ అధికారులు భూమిని వాడుకోనందున స్థానికులు వాహనాల పార్కింగ్‌గా.. చెత్త చెదారంతో డంపింగ్ యార్డుగా మార్చారు. కోట్ల విలువ చేసే ఓయూ భూమి మళ్లీ కబ్జా కాకుండా అవసరానికి వాడుకోవాలని లేదా చుట్టూ ప్రహరీ నిర్మించాలని విద్యార్థులు కోరుతున్నారు. –ఉస్మానియా యూనివర్సిటీ